కోనో కార్పస్ మొక్కల వద్ద ప్లకార్డులను ప్రదర్శిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ

కడ్తాల్, ఏప్రిల్ 16 : సమాజంలో కోనోకార్పస్ మొక్కలపై ఉన్న అపోహాలను వీడాలని.. జీవకోటి మనుగడకు మొక్కలను సంరక్షించాలని గ్రీన్ ఇండియా చాలెంజ్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో ప్రకృతి ప్రేమికులతో కలిసి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి డివైడర్‌పై నరికిన కోనోకార్పస్ మొక్కల వద్ద ప్లకార్డులను ప్రదర్శించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు విరివిగా మొక్కలను నాటి సంరక్షించాలని లక్ష్మీనర్సింహారెడ్డి సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో హరితహారం, పల్లెప్రగతి కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రంలో నాటిన కోనో కార్పస్ మొక్కలపై అనవసర రాద్ధాంతం చేసి అపోహాలు సృష్టించి వాటిని తొలగించడం దారుణమన్నారు. ఎలాంటి శాస్త్రీయ ఆధారాల్లేకుండా ఏపుగా పెరిగే కోనోకార్పస్ మొక్కలను పర్యావరణ పరిరక్షణ పేరిట నరకడం బాధాకరమన్నారు. వృక్ష శాస్త్రవేత్తలు ఏఆర్ రెడ్డి, మోహన్‌రావు, బీఎన్.రెడ్డి, లక్ష్మాణారెడ్డి తదితరులు కోనో కార్పస్ మొక్కలపై పరిశోధనలు జరిపి, వాటితో పర్యావరణానికి ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు దాసు, రవి, మహేశ్, కృష్ణ, విక్రంగౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మంచాల, ఏప్రిల్ 16: మండల పరిధిలోని నోముల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కరుణాకర్‌రెడ్డి బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆయన భౌతికాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో బీఆర్ఎస్ నాయకుడు రమేశ్, చంద్రయ్య, రాంరెడ్డి, విజయ్, వీరేశంతో పాటు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆమనగల్లు : ఆకుతోటపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక

ఆమనగల్లు, ఏప్రిల్ 16: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. మండలంలోని ఆకుతోటపల్లి అంగన్‌వాడీ పరిధిలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా (పోషణ పక్షం) వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూపర్‌వైజర్ రాధిక హాజరై మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు ఆరు నెలల వరకు ఖచ్చితంగా ఇవ్వాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు విజయలక్ష్మి, సువర్ణ, అలీం, మార్తమ్మ, మైనా, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కేశంపేట : గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు తమ ఆరోగ్యంపట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ కేశంపేట సూపర్‌వైజర్ దివ్య అన్నారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం మహిళలకు జిమ్స్ హోమియోపతి మెడికల్ కళాశాల, దవాఖాన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ పూనర్‌సుతార్, డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి విద్యావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, జిమ్స్ ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీవో వనితాదేవి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, ఏపీఎం రవిందర్, వైద్యాధికారి సరిత అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని వైష్ణవిగార్డెన్‌లో బుధవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి, పల్లవి, విద్యాలత, అరుణ, కల్పన, సరళ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: పోషకాహారం కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

కేశంపేటలో..

పేదలకు తక్కువ ధరకే ఇసుక

ఇసుక బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

ఆదిబట్ల, ఏప్రిల్ 16: ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయడానికే ప్రభుత్వ ఇసుక బజారులను ఏర్పాటు చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఆదిబట్లలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక బజారును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు తక్కువ ధరకే ఇసుక అందుబాటులో ఉండే విధంగా ఇసుక బజారును ఏర్పాటు చేస్తుందని అన్నారు. దొడ్డు ఇసుక టన్నుకు రూ.1600, సన్న ఇసుక టన్నుకు రూ.1800 చొప్పున ధరను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే నేరుగా ఇంటి వద్దకే ఇసుక సరఫరా చేస్తారని, ప్రతి ఒక్కరూ ఇసుక బజార్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇసుక బుకింగ్ కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీజీఎండీసీ సుశీల్‌కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహిపాల్, ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, పల్లె రజినికాంత్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

హైటెన్షన్ విద్యుత్ లైన్‌తో రైతులకు నష్టం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కడ్తాల్, ఏప్రిల్ 16: కడ్తాల్ మండల కేంద్రం సమీపం గుండా వెళ్తున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్‌తో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ లైన్ బాధిత రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి మహేశ్వరం పవర్‌స్టేషన్‌కు నిర్మిస్తున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్‌తో నష్టపోతున్నట్లు తెలిపారు. కడ్తాల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని 66 సర్వే నంబర్లలో ఉన్న భూముల్లో 150 మంది రైతుల పొలాల గుండా విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇది వరకే గ్రామ శివారు గుండా మూడు భారీ హైటెన్షన్ పోల్‌లైన్లు వేశారని, ఇప్పుడు ఏర్పాటు చేస్తున్న లైన్‌తో మరింత నష్టపోతున్నామని వాపోయారు. సదరు విద్యుత్ సంస్థ భూములు కోల్పోతున్న రైతులకు పరిహారంగా అందించే గజానికి తక్కువ ధరను నిర్ణయించినట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కడ్తాల్ గ్రామ సమీపంలోని వెంచర్లలో గజం భూమి ధర రూ. 25వేల వరకు పలుకుతుందని, గజానికి రూ.12వేలు నిర్ణయించి అందించేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా ముదిరాజ్, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మహేశ్, శ్రీనివాస్‌గౌడ్, చందోజీ, నర్సింహ, నరేశ్‌నాయక్, రాములుయాదవ్, జంగారెడ్డి, వెంకటేశ్, రవి, శ్రీరాములుగౌడ్, కృష్ణయాదవ్, గణేశ్‌ముదిరాజ్ ఉన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పలు కాలనీ వాసులు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 16: చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని బాలాజీ నగర్, కృష్ణారెడ్డినగర్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఆ కాలనీవాసులు చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌కు వినతి పత్రం అందజేశారు. చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ సానుకూలంగా స్పందించి పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీలవాసులు చెన్న కేశవులు, నర్సింహులు, శ్రీనివాస్, సత్యం, తిరుపతి, నర్సింహులుగౌడ్, శ్రీనివాస్, మల్లేశ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆనంద్, నవీన్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై ఫిర్యాదు

కొందుర్గు, ఏప్రిల్ 16: కొందుర్గులోని శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ భూముల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంపట్ల పాలకమండలి వర్గంలోని సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ బుధవారం ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యుల అనుచరులు మాట్లాడుతూ.. ఆలయానికి సంబంధించిన భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని, ఆలయ భూముల మీదుగా ప్రైవేటు వ్యక్తులకు చెందిన వెంచర్‌కు స్తంభాలను ఏర్పాటు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై అధికారులు స్పందించి స్తంభాలను తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

కుమ్మరి వాగు కాపాడాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 16 : మండలంలోని లష్కర్‌గూడ రెవెన్యూ అనాజ్‌పూర్ వద్ద సంఘీ వైపు నుంచి వచ్చే కుమ్మరి వాగు కబ్జాకు గురైన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను రక్షించాలని కోరుతూ మండల తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ లష్కర్‌గూడ నుంచి అనాజ్‌పూర్ వెళ్లే కల్వర్టు వద్ద కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కుమ్మరివాగు ఆక్రమించి ప్రహరీ నిర్మించి రోడ్డు వేశారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి కుమ్మరివాగుకు అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించి వాగును రక్షించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం మండల కమిటీ సభ్యులు లింగస్వామి, శివకుమార్, వెంకటేశ్, మహేశ్, రవి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

సభను విజయవంతం చేయాలి

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 16 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నెల 27వ తేదీన జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు చేవెళ్ల నుంచి ప్రతి ఒక్కరూ తరలిరావాలని బీఆర్ఎస్ యువ నాయకుడు భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధి ఈర్లపల్లి గ్రామంలో భాస్కర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ సభకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ మోదీన్, కె.సుగుణాకర్, కె.జనార్దన్, కె.కరుణాకర్, సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 16: చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని జాతీయ రహదారిపై వెలిసిన అక్రమ కట్టడాలు, బోర్డులను చేవెళ్ల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మణిహారిక, చేవెళ్ల డివిజన్ ట్రాఫిక్ సీఐ వెంకటేశం, సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా చేవెళ్ల డివిజన్ ట్రాఫిక్ సీఐ వెంకటేశం మాట్లాడుతూ రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారులు వాహనాలను రోడ్డు మీద పార్కింగ్ చేయటంతో ట్రాఫిక్ ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలను నడిపితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డును ఆక్రమిస్తే షాప్ యజమానుల పై చర్యలు తీసుకోవడమే కాకుండా జరిమానా విధిస్తామని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మణిహారిక పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సిబ్బంది ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

కడ్తాల్, ఏప్రిల్ 16 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు, రూ.16 లక్షల విలువ సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఆయన వెంట ఏఎంసీ చైర్‌పర్సన్ గీతాముదిరాజ్, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ నరేశ్‌నాయక్, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, రాములుగౌడ్, బీచ్యానాయక్, భీక్యానాయక్, జంగారెడ్డి, చందోజీ, లక్పతినాయక్, బాలరాజు, శేఖర్, తులసీరాం పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

ఆరుట్లలో ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

మంచాల, ఏప్రిల్ 16: నీటి వసతులున్న వ్యవసాయ భూముల్లో ఆయిల్ పామ్ తోటలు సాగుచేసే రైతులు అధిక లాభాలు పొందవచ్చునని హార్టికల్చర్ ఏడీఏ అరుణ్ అన్నారు. బుధవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై అధికారులు రైతులకు ఆవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 113ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగుచేసుకున్నారని, ఇంకా ఆసక్తి ఉన్న రైతులు వెంటనే అధికారులు, కంపెనీ ప్రతినిధులను సంప్రదించాలని కోరారు. ఇందుకు రెండు విడతలుగా రూ. 8,400 రైతు ఖాతాల్లో జమ చేస్తారని చెప్పారు. అదేవిధంగా 90శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను కూడా అందజేయడమే కాకుండా ఎరువులకు ఒక ఎకరానికి 4,200 చొప్పున నాలుగు సంవత్సరాలకు 16,800 ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. ఈ పంటకు మార్కెట్‌లో మద్దతు ధర రూ.21,000 ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు వెంటనే ఈ పంట సాగు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయిల్ వాల్యూ కంపెనీ ఉపాధ్యక్షుడు రామ్మోహన్, ఉద్యానవన శాఖ అధికారి నవీన్, ఏఈవోలు లింగస్వామి, సాయివాణి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

యాచారం, ఏప్రిల్ 16: ఉపాధి కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య డిమాండ్ చేశారు. మండలంలోని తమ్మలోనిగూడ గ్రామంలో బుధవారం ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. పనులు చేసి నెలలు గడుస్తున్నా కూలీ డబ్బులు చెల్లించకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. కూలీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఇక్కడి ప్రాంతాల్లో ఉపాధి పనులు నిలిపివేయాలని చూస్తే ఊరుకునేదిలేదన్నారు. కూలీలకు ప్రతి రోజూ రూ.600 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫార్మా గ్రామాల్లో భూముల చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్న అధికారులు ఉపాధి కూలీలకు ప్రత్యామ్నాయంగా ఇతర పనులను కల్పించాలన్నారు. కూలీల సమస్యలు పరిష్కరించకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు తదితతరులున్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అంజయ్య

తాగునీటి సమస్య రానీయొద్దు

మొయినాబాద్, ఏప్రిల్ 16 : ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడితే ఇరవై నాలుగు గంటల్లో పరిష్కరించాలని మొయినాబాద్ మున్సిపాలిటీ కమిషనర్ ఖాజామొయిజూద్దీన్ అన్నారు. బుధవారం అజీజ్‌నగర్ గ్రామంలో ఉన్న మున్సిపాలిటీ కార్యాలయంలో మంచినీటి సరఫరాపై అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల పాటు మంచినీటి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. సమస్య ఉత్పన్నమయితే వెంటనే స్పందించి 24 గంటల్లో సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. గ్రామంలో బోర్లు ఎండిపోతే కొత్తవి వేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనంగా కొత్త పంపు సెట్ల కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నామని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 16 : చేవెళ్ల మున్సిపల్ పరిధి ఊరెళ్ల వార్డులోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఊరెళ్ల వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకొని ఆదర్శంగా నిలుపుతామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ సర్పంచ్ జహంగీర్, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ రాక

కేశంపేట, ఏప్రిల్ 16: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూభారతిపై అవగాహన కల్పించేందుకు కేశంపేట మండలానికి గురువారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు తహసీల్దార్ ఆజంఅలీ బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని బీఎస్‌వై గార్డెన్‌లో మధ్యాహ్నం 3గంటలకు జరిగే అవగాహన సదస్సులో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొంటారని వివరించారు.

ఘన సన్మానం

ఆమనగల్లు, ఏప్రిల్ 16 : తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు హన్మంత్‌రెడ్డి బుధవారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో హన్మంత్‌రెడ్డిని ఘనంగా శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్‌కుమార్‌గౌడ్, గ్రంథాలయ కార్యదర్శి మల్లేశ్, క్రీడా సాంస్కృతిక కార్యదర్శి శేఖర్ న్యాయవాదులు మల్లేశ్, సంతోశ్, జగన్ గౌడ్, మురళికృష్ణ, సర్దార్‌నాయక్, దేవేందర్, శిరీశ్, మహేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కేశంపేట, ఏప్రిల్ 16: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామానికి చెందిన వేణు(32) ఎనిమిదేళ్ల క్రితం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన లతను ప్రేమించి వివాహం చేసుకున్నాడన్నారు. డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకోవడంతో లత ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయి కొన్ని రోజులకు తిరిగి వచ్చేదని తెలిపారు. ఈ విషయమై మనోవేదనకు గురైన వేణు మద్యానికి బానిసై ఈ నెల 15న రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్సకోసం షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు ఉస్మానియాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 16న ఉదయం మృతి చెందాడని, మృతుడి తండ్రి నర్సింహాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గిరిజనుల భూములను కాపాడాలి

కడ్తాల్, ఏప్రిల్ 16: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలోని గిరిజనులకు చెందిన భూములను కొంత మంది రియల్ ఎస్టేట్ దళారులు ఫోర్జరీ సంతకాలతో నకిలీ ఒప్పంద పత్రాలను సృష్టించి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ బుధవారం సాయంత్రం తహసీల్దార్ ముంతాజ్, సీఐ గంగాధర్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. తండాకు చెందిన పలువురి రైతులకు సంబంధించిన భూములకు నకిలీ పత్రాలు సృష్టించి కాజేసేందుకు రియల్ దళారులు, కంపెనీ నిర్వాహకులు కుట్రలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు ఎలాంటి సంబంధం లేకుండానే భూములకు ఒప్పందం చేసుకున్నట్లు కాగితాలను సృష్టించి, కొందరికి అమ్మినట్లు సమాచారమందిందని, అలాంటి భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అదే విధంగా నకిలీ ఒప్పంద పత్రాలు సృష్టించి భూములను కాజేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐకి ఫిర్యాదు చేశారు.



రావినారాయణరెడ్డి చౌరస్తా నుంచి కుంట్లూరు వెళ్లే మార్గంలో అంధకారం

చీకట్లలో కదిలేదెట్టా!

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 16: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు- నాగోల్ రోడ్డులో రాత్రయితే అంధకారం అలుముకుంటున్నది. కుంట్లూరు చౌరస్తా దాటిన తర్వాత రావినారాయణరెడ్డి కాలనీ చౌరస్తా వరకు, అక్కడ నుంచి తట్టిఅన్నారంలో రోడ్డు వెంట కొంత మేర వందకు పైగా స్తంభాలు ఉన్నాయి. ఆర్ఎన్ఆర్ చౌరస్తాలో హైమాస్ట్ లైట్ మినహా ఏ ఒక్కచోట కూడా విద్యుత్ లైట్లు కనిపించడంలేదు. రాత్రయితే చిన్నవాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించేందుకు జంకుతున్నారు. పాదచారులు, సైకిళ్లపై వెళ్లే వారి పరిస్థితి దారుణంగా తయారైంది. మున్సిపల్ అధికారులు స్పందించి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.